క్లుప్తంగా

వర్షపు నీరు నిలబడకుండా చూడండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: వర్షపు నీరు నిలబడకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. చినరావూరు తోటలో గురువారం ఆయన పర్యటించారు. ఆప్రాంతంలోని మురుగు కాల్వలను బాగు చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని మురుగు కాల్వలు ప్రతిరోజు బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

మురుగు కాల్వలపై ఆక్రమణలు తొలగించండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: మురుగు కాల్వపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. పట్టణంలోని 8,10 వార్డులలో గురువారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాల్వలపై కొందరు రాళ్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల కాల్వల పూడికతీత పనులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. వెంటనే వాటిని తొలగించి ప్రతిరోజు వాటిని బాగు చేయాలని సూచించారు. ఆమె వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పుట్టలమ్మ హుండీ ఆదాయం రూ.43,979

కర్లపాలెం: యాజలి గ్రామ దేవత పుట్టలమ్మ అమ్మవారి ఆలయ హుండీల ఆదాయం రూ.43,979 వచ్చినట్లు ఈవో శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి ఆలయంలోని హుండీలలోని కానుకలను ఆలయ ఈవో శ్రీనివాసరావు పర్యవేక్షణలో గురువారం భక్తులు, ఆలయ అర్చకులు లెక్కించారు. ఈ ఆదాయం గత సంవత్సరం కంటే రూ.2 వేలు అదనంగా వచ్చినట్లు ఆయన తెలిపారు. అమ్మవారి ఆలయంలోని 1వ నంబర్ హుండీలో రూ.1,563, రెండవ హుండీలో రూ.42,416 వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు.

వికలాంగ పింఛన్లు పొందే వారికి మళ్లీ వైద్య పరీక్షలు

ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని

చెరుకుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రతా పింఛన్ల పథకంలో కొందరు అనర్హులు వికలాంగ పింఛన్లు పొందుతున్నట్లు ప్రభుత్వ అధికారులు గుర్తించారని మండల అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ సుభాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్ల పునః పరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు మండల పరిధిలో లోకో మోటార్ లోపంతో పింఛన్ తీసుకుంటున్న 863 మందికి రేపల్లె ఏరియా వైద్యశాలలో ఈ నెల 22వ తేదీ నుంచి జూన్ మొదటి వారం వరకు షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు. పింఛన్‌దారులకు ముందుగానే సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్స్ నోటీసులు అందజేస్తారని ఆ నోటీసులో పింఛన్‌దారు ఏ తేదీ.. ఏ సమయంలో హాస్పిటల్‌కు హాజరు కావాలో ఉంటుందన్నారు. ఎవరైనా వారికి ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం హాజరు కాని ఎడల వచ్చే నెలలో వారి పింఛన్ తాత్కాలికంగా నిలిపివేయబడుతుందని సుభాని తెలిపారు.

ప్రయాణికులకు అదనపు సౌకర్యాలు కల్పించాలి

రేపల్లె: రైల్వే ప్రయాణికులకు అదనపు సౌకర్యాలు కల్పించాలని పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సి.వి.మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాలపై డివిజనల్ రైల్వే మేనేజర్‌కు వినతి పత్రం ఫ్యాక్స్ ద్వారా పంపామన్నారు. రేపల్లె– సికింద్రాబాద్ డెల్టా ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ కోచ్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. ఏసీ కోచ్‌ల్లో అంతకుముందు ప్రయాణికులు వినియోగించిన దిండ్లు, దుప్పట్లను శుభ్రం చేయకుండా అలాగే ప్రయాణికులకు అందిస్తున్నారని ఆరోపించారు. వాటిని వినియోగించే ప్రయాణికులకు చర్మ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. శుభ్రం చేసిన వాటిని అందించాలని కోరారు. అదేవిధంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రేపల్లె గుంటూరుకు తెనాలి మీదుగా ప్రతి 2 గంటలకు ఒక రైలును నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. పల్నాడు, రాయగడ, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లను రేపల్లె నుంచి నడపాలని కోరారు. రేపల్లె రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికుల అసౌకర్యాన్ని తొలగించాలని కోరారు.



సీలింగ్‌లేని సచివాలయంలో సిబ్బంది విధులు



సచివాలయంలో కుప్పకూలిన హెవీ సీలింగ్ (ఫైల్)

సీలింగ్ పునరుద్ధరణ 'కూలినట్టేనా'?

- ఫ్యాన్ల రిపేర్లతోనే సరిపెట్టిన మున్సిపాలిటి
- 2024 అక్టోబరులో కూలిన సీలింగ్
- సిబ్బందికి తప్పిన పెనుప్రమాదం
- నాణ్యతా లోపమే ప్రధాన కారణం
- రూ.49 లక్షలతో నిర్మాణం

తెనాలి: పట్టణ 13వ వార్డు చినరావూరులో కమ్యూనిటీ హాలుపై అంతస్తులో గల సచివాలయంలో గత ఏడాది కుప్పకూలిన సీలింగ్ పునరుద్ధరణ జరగలేదు. దెబ్బతిన్న సీలింగ్ ఫ్యాన్లకు మాత్రం తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. నెలలు గడుస్తున్నా సీలింగ్‌ను పట్టించుకోకపోవటంతో అలాగే వదిలేసినట్టుగా భావిస్తున్నారు. దీనిపై స్థానికులు విమర్శిస్తున్నారు. చినరావూరులోని కమ్యూనిటీ హాలుపై అంతస్తులో సచివాలయం సీలింగ్ 2024 సంవత్సరం అక్టోబరు నెలలో కుప్పకూలింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన హెవీ సీలింగ్ మొత్తం కుప్పకూలింది. రాత్రి సమయంలో జరిగిన ఈ ఘటన పగటిపూట జరిగినట్టయితే పెనుప్రమాదం జరిగి ఉండేది, నాణ్యతా లోపమే ఇందుకు ప్రధాన కారణమని అప్పట్లో స్థానికులు స్పష్టం చేశారు. ఇది జరిగిన తర్వాత మున్సిపల్ అధికారులు సచివాలయానికి వెళ్లి కుప్పకూలిన సీలింగ్‌ను పరిశీలించారు. త్వరలో రిపేర్లు చేసి సీలింగ్‌ను చేయిద్దామని కూడా చెప్పినట్టు స్థానికులు తెలియజేశారు. అయినప్పటికీ సీలింగ్ పడిపోయినపుడు దెబ్బతిన్న ఫ్యాన్లను మాత్రం రిపేర్లు చేసి, సీలింగ్‌ను విస్మరించారు. కనీసం థర్మాకోల్‌తోనైనా సీలింగ్ వేయకపోవటంపై విమర్శలు వస్తున్నాయి.

13వ వార్డులోని కమ్యూనిటీ హాలుకు పైఅంతస్తు నిర్మాణాన్ని టీటీపీ హయాంలో చేపట్టారు. 2017లో రూ.49 లక్షల మున్సిపాలిటీ నిధులతో



ఆవరణలోనే పడేసిన సీలింగ్ వ్యర్థాలు

ఆరంభించిన నిర్మాణం పూర్తికావటానికి దాదాపు రెండేళ్లు పట్టింది. కమ్యూనిటీ హాలుపై గోడలు నిర్మించి, రేకులు బిగించి, సీలింగ్ చేశారు. 2019 జనవరిలో అప్పటి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్మన్ పెండేల వెంకట్రావు, కమిషనర్ కంఠమనేని శకుంతల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేశారు. ఆ తర్వాత కొద్దినెలలకే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే.

2021లో గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ఆవిర్భవించాక, స్థానిక 13వ వార్డులో సచివాలయాన్ని అక్కడి రావిచెట్టు దగ్గర్లోని ఆయుర్వేదిక్ హాస్పటల్ వద్ద భవనంలో ఏర్పాటు చేశారు. పాత భవనం కావటంతో పెచ్చులూడటం, వర్షపునీరు లీకేజీ అవుతుండటంతో ఆ సచివాలయాన్ని అదే వార్డులోని కమ్యూనిటీ హాలు పైభాగంలో నిర్మించిన మొదటి అంతస్తులోకి మార్చారు. అదే పై అంతస్తులోని హెవీ సీలింగ్ 2024 అక్టోబరు 14 రాత్రి కుప్పకూలింది. ఫ్యాన్ల రెక్కలను విరిచేసుకుంటూ టేబుళ్లు, కంప్యూటర్లపై సీలింగ్ పడింది. సీలింగ్‌కు బిగించిన బోల్టులు కూడా ఎక్కడివి అక్కడే పైనే ఉండిపోయాయి. సీలింగ్ మాత్రమే మొత్తం కూలిపోయింది.

సచివాలయంలో మొత్తం తొమ్మిదిమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. సాయంత్రం పనివేళలు ముగిశాక యథావిధిగా తాళాలు వేసి వెళ్లిపోయిన సిబ్బంది, ఉదయాన్నే వచ్చి చూసేసరికి కనిపించిన దృశ్యాన్ని చూసి హడలిపోయారు. విధి నిర్వహణలో ఉన్నపుడు జరిగివుంటే జరిగే ప్రమాదాన్ని తలచుకుని భీతిల్లారు.

మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి జరిగిన విషయాన్ని తెలియజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత సీలింగ్ కూలిన సచివాలయాన్ని సందర్శించారు. నాణ్యతా లోపంతోనే సీలింగ్ కుప్పకూలిందని కౌన్సిలరుతోపాటు స్థానికులు అప్పట్లో అభిప్రాయపడ్డారు.



పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కౌన్సిలర్ సుజాత (ఫైల్)

ఏపీజీఈఏ సమావేశాలు జయప్రదం చేయండి

పీజీఈఏ దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందె బాలచంద్రమౌళిన, ప్రధాన కార్యదర్శి టి.మనోహర్‌రెడ్డి

కొల్లిపర: విజయవాడలో 5న జరిగే రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏపీజీఈఏ దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందె బాలచంద్రమౌళిన, ప్రధాన కార్యదర్శి టి.మనోహర్‌రెడ్డి కోరారు. గురువారం కొల్లిపరలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జూన్ 5న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగనున్న ఏపీజీఈఏ రాష్ట్రకౌన్సిల్ సమావేశాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అందరూ హాజరు కావాలని కోరారు. జిల్లా ఐక్యవేదిక చైర్మన్ సయ్యద్ చాంద్‌బాషా ఆదేశాల ప్రకారం కొల్లిపర తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ, రిజిస్ట్రేషన్ సిబ్బందితో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఉద్యోగుల సమస్యలపై చర్చించి అనంతరం ఏపీజీఈఏ తరపున ప్రధాన నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. కావున ఈ సమావేశాలకు ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల



సమావేశంలో మాట్లాడుతున్న యూనిట్ అధ్యక్షులు అందె బాలచంద్రమౌళి

యూనిట్ అధ్యక్షులు అందెబాల చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు గుంటూరు పూర్ణప్రసాద్, ఉపాధ్యక్షులు షేక్ మీరావలి, జాయింట్ సెక్రెటరీ నూకవరపు శ్రీలక్ష్మి కుమారి, కార్యవర్గ సభ్యులు కొల్లిపర మండల తహసీల్దార్ గుమ్మడి సిద్దార్థ, మండల అభివృద్ధి అధికారి వీరమాచనేని విజయలక్ష్మి సబ్ రిజిస్ట్రార్.ఎం.ఆదినారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఇఓపీఆర్డీ సి.హెచ్.భార్గవ్, పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ర్ వంశీకృష్ణ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఎం.శ్రీలక్ష్మి కుమారి, ఫిజికల్ డైరెక్టర్స్ సూర్యప్రకాష్, దేవదాస్, వీఆర్వోలు భాస్కర్, సుష్మ, ప్రసాద్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'హెల్త్ ఆన్ వీల్స్'తో ఉచిత వైద్యశిబిరం

వ్యాధినిర్ధారణ పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్

తెనాలి: వ్యాధి రహిత తెనాలి కోసం కృషిచేస్తున్న పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో 'హెల్త్ ఆన్ వీల్స్'తో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగే వైద్యశిబిరానికి వచ్చేవారు ఆహారం తిని, పాత రిపోర్టులతో సహా రావాలని సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద ఒక ప్రకటనలో తెలియజేశారు. అన్ని రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు ఒకేచోట జరిగేలా 'హెల్త్ ఆన్ వీల్స్' వాహనంలో ఏర్పాటు చేశామని చెప్పారు. కిమ్స్–చక్ర క్యాన్సర్ సెంటర్ తక్కెళ్లపాడు అనుబంధంతో క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తున్నట్టు చెప్పారు. ఉచిత వైద్యశిబిరంలో బీపీ, షుగరు, థైరాయిడ్, శ్వాసకోశ వ్యాధులు, స్త్రీల వ్యాధులకు సలహాలతోపాటు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్‌ను ముందుగా కనుగొనే స్క్రీనింగ్ పరీక్షలైన పాప్ స్మియర్, మమోగ్రామ్ పరీక్షలు, స్కానింగ్, ఎక్స్‌రే పరీక్షలు ఉచితంగా చేస్తామని తెలిపారు. అవసరమైనవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



డాక్టర్ డి.శారద

భక్తులకు అన్నప్రసాద వితరణ


తెనాలి: పట్టణ రజకచెరువు వద్ద గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు చేశారు. బీఎస్ఆర్ నాయుడు ఆధ్వర్యంలో రెండు వేలమంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



శ్రీ ఆంజనేయం... ప్రసన్నాంజనేయం...



ప్రత్యేక అలంకరణలో శ్రీచిట్టి ఆంజనేయుడు



శ్రీచంద్రమౌళేశ్వర దేవస్థానంలో వీరాంజనేయుడు



మఠంబజారులో సంజీవని పర్వత ధర వీరాంజనేయస్వామి అలంకారం



శ్రీవిద్యాపీఠంలో వీరాంజనేయ స్వామి మామిడి ఫలార్చన

ఆంధ్రా ప్యారిస్‌లో వైభవంగా హనుమత్ జయంతి

తెనాలి: హిందూ పండుగల్లో ప్రముఖమైనది హనుమత్ జయంతి. శ్రీరాముడికి పరమ భక్తుడిగా, ధైర్యం, బలం, భక్తి, జ్ఞానం, వినయం వంటి సుగుణాల సాక్షాత్కారంగా హనుమంతుడు విఖ్యాతుడు. ఈరోజున భక్తులు ఉపవాసం చేస్తూ హనుమాన్ చాలీసా పారాయణ చేస్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకారాలు విశేషంగా ఉంటాయి.

శతవసంతాల చిట్టి ఆంజనేయ ఆలయంలో...

పట్టణ బోసురోడ్డులోని శతవసంతాల చరిత్ర కలిగిన శ్రీచిట్టి ఆంజనేయస్వామి దేవస్థానంలో 101వ హనుమత్ జయంతి ఉత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం మన్యు సూక్త అభిషేకం అనంతరం తమలపాకులు, సింధూరంతో సహస్రనామ పూజ, వివిధ పుష్పాలతో అలంకరణ చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల భక్తులు విశేషంగా స్వామివారిని దర్శించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ వ్యవస్థాపకుడు స్వర్గీయప్రభల వెంకటసుబ్బయ్య కుటుంబీకులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. స్వామివారి పూజా కైంకర్యాలను ఆలయ అనువంశిక అర్చకులు దీవి యోగానందచక్రవర్తి, దీవి శ్రీనివాసగౌతమ్, దీవిపవన్ కుమార్, దీవి వేణుమాధవ షణ్ముఖవర్ధన్ నిర్వహించారు.

శ్రీకోదండరామస్వామి ఆలయంలో...

స్థానిక మారీసుపేటలో గల శ్రీకోదండ రామస్వామి దేవస్థానం (రామభక్త అప్పలస్వామి గుడి)లో హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేంచేసి ఉన్న వీరాంజనేయస్వామికి ఆకు పూజ, ప్రాతఃకాలార్చన, వడమాల అప్పలమాల సమర్పించారు. స్వామివారికి విశేష కార్యక్రమాల్లో భాగంగా భక్తుల చేత పంచామృత అభిషేకం, డ్రై ఫ్రూట్స్, పళ్లరసాలతో అభిషేకం, తమలపాకులతో సహస్రనామావళి పూజ, మామిడి పండ్లతో అష్టోత్తరం, ఎంతో విశేషమైన మన్య సూక్తం హోమం జరిపించారు. ఆలయ ధర్మకర్తలు లంక శివానంద్ కుమార్, కునపల్లి నారాయణస్వామి, లంక శివాంజనేయ ప్రసాద్ పర్యవేక్షించారు. విష్ణుభట్ల ఆంజనేయశాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు. ధనుష్ సుబ్రహ్మణ్య శర్మ కార్యక్రమాలను నిర్వర్తించారు.



శ్రీచిట్టి ఆంజనేయస్వామి దేవాలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో...

పట్టణ మారీసుపేటలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీచంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి వేడుకలను వేడుకగా చేశారు. ఆలయంలోని వీరాంజనేయస్వామికి లక్ష ప్రదక్షిణముల మహాయజ్ఞం కొనసాగుతున్న విషయం తెలిసిందే. గురువారం ఉదయం స్వామివారికి పంచామృత సహిత ఫల అభిషేకం చేశారు. సహస్ర నారికేళ అర్చన జరిపిన అనంతరం హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. లలితా గోష్ఠి వారిచే హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. సాయంత్రం 6.30 గంటలకు సువర్చలా హనుమత్ కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతుమాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగసూర్య శశిధరరావు, కోశాధికారి వరదా వెంకట శేషగిరిరావు, పేరుబోయిన అంకమ్మరాజు, తాడిపర్తి హరిప్రసాద్ పర్యవేక్షించారు.



శ్రీవీరప్రతాప ఆంజనేయస్వామి ఆలయంలో పూజల్లో భక్తులు

శ్రీ గోవర్ధనస్వామి ఆలయంలో...

స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీ రుక్మిణీ సమేత శ్రీగోవర్ధనస్వామి ఆలయం, శ్రీ సువర్చలా సమేత శ్రీ వీరప్రతాప ఆంజనేయస్వామివార్ల దేవస్థానంలో వార్షిక హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా జరిపారు. ఉదయం సుప్రభాత సేవ, ఉత్సవ విగ్రహాలకు మన్యుసూక్తపూర్వక ఏకాదశ స్నపన చేశారు. ప్రత్యేక అలంకరణ చేసి భక్తులచేత లక్ష తమలపాకులచే నాగవల్లీ దళార్చనను జరిపించారు. తదుపరి స్వామివారి శాంతి కల్యాణం నిర్వహించారు. హారతి, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం, ఊరేగింపు చేశారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్‌పీఎస్ మల్లేశ్వరి పర్యవేక్షణలో ప్రముఖ వైఖానస ఆగమ పండితుడు వేదాంతం మాధవకుమార్ శిష్యబృందంచే పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

మఠంబజారు ఆలయంలో...

స్థానిక మారీసుపేట మఠంబజారులో వేంచేసియున్న శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృత, ఫల, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి, స్వామివారికి విశేష దివ్య అలంకరణ చేశారు. నాగవల్లీ దళార్చన, సింధూరార్చన చేశారు. నీరాజన, మంత్రపుష్ప, తీర్థప్రసాద వినియోగం జరిగింది. హనుమత్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీస్వామివారిని విశేషమైన 'సంజీవని పర్వత ధర వీరాంజనేయస్వామి' అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీరామ హనుమ భజనమండలి, తెనాలి వారిచే భజన కార్యక్రమం జరిగింది. మందిర కమిటీ సభ్యులు నీలా కృష్ణమూర్తి, బూతనపల్లి వెంకటనారాయణ, తుళ్లూరు ఏడుకొండలు, కొత్త ఆంజనేయులు, సంపతి కోటేశ్వరరావు, లక్కోజి నరేంద్ర, ఆకురాతి సురేష్ పర్యవేక్షించారు.

శ్రీవిద్యాపీఠంలో...

పట్టణ గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో హనుమత్ జయంతి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెనుగొండ పీఠాధిపతి బాలస్వామీజీ స్వయం పర్యవేక్షణలో అభిషేకాలు, సింధూర అర్చన చేశారు. ఆలయ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, మానేపల్లి శ్రీనివాసరావు, ధనలక్ష్మి, సావిత్రి, సాలిగ్రామ మఠం, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు. హనుమాన్ చాలీసా పారాయణ చేశారు.

శారదా చలపతి ఆధ్వర్యంలో...

ఇక్కడి గంగానమ్మపేటలోని పారడైజ్ గృహ సముదాయంలో ప్రముఖ భక్తి కీర్తనల గాయని, ఆధ్యాత్మిక సేవకురాలు శారదా చలపతి ఆధ్వర్యంలో హనుమత్ జయంతిని భక్తిశ్రద్ధలతో జరిపారు. శారదా చలపతి భక్తి సంకీర్తన చేశారు. కార్యక్రమంలో నగరాజకుమారి, రమేష్, సుబ్బారావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.



పారడైజ్ గృహసముదాయంలో హనుమత్ జయంతి

ప్రసన్నాంజనేయుడికి విశేష పూజలు

తెనాలి: స్థానిక 29వ వార్డు సుల్తానాబాద్‌లోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు చేశారు. సలహా కమిటీ చైర్మన్ కోటేశ్వరరావు (నానిక), గౌరవ అధ్యక్షుడు రవి రమావత్, అధ్యక్షుడు మేఘావత్ స్వామి నాయక్, ఉపాధ్యక్షుడు పోతురాజు యడ్లపల్లి, కార్యదర్శి రాజా నాయక్ రమావత్ పర్యవేక్షించారు.



పూజల్లో పాల్గొన్న పాలకవర్గ సభ్యులు

వైభవంగా వార్షిక శ్రీహనుమత్ జయంతి ఉత్సవాలు

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్‌లో వేంచేసి ఉన్న శ్రీసువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక శ్రీ హనుమత్ జయంతి మహోత్సవాలు, 17వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, విశేష నాగ వల్లీ దళార్చన, విశేష పూజలను ఆలయ వంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణను ప్రారంభించారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 11 రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు జరుగుతాయని తెలిపారు. శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం నేతృత్వంలో ప్రతిరోజు 108 సార్లు శ్రీహనుమాన్ చాలీసా పారాయణ జరుగుతుందని చెప్పారు.. వంశ పారంపర్య అర్చకులు శ్రీనివాసమూర్తి ,కిరణ్ కుమార్, సురేష్, కౌన్సిలర్లు పి.త్రిమూర్తి, దేసు యుగంధర్, సంకీర్తన బృందం అధ్యక్షులు మూర్తి అనురాధ, ట్రస్టు సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, ముదుపల్లి చంద్రశేఖర్, జంధ్యం రామారావు, గాజుల రాజేంద్రప్రసాద్, మాజేటి వెంకటేష్, మద్దు హరీష్, కొల్లూరు విద్యాసాగర్, బచ్చు లీలా ప్రసాద్, వెచ్చ కృష్ణకిశోర్, పలువురు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తులకు విశేషార్చన

అట్టహాసంగా హనుమాన్ శోభాయాత్ర

తెనాలి: హనుమజ్జయంతి రోజైన గురువారం సాయంత్రం పట్టణంలో నిర్వహించిన శ్రీ హనుమాన్ అట్టహాసంగా సాగింది. శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన శోభాయాత్రలో రాజకీయ పార్టీలకు అతీతంగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక సుల్తానాబాద్‌లోని మార్కెట్ యార్డు సమీపంలో గల ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద సాయంత్రం ప్రారంభమైన శోభాయాత్ర ప్రారంభమైంది. వందల సంఖ్యలో యువత కాషాయ జెండాలు ధరించి పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఆంజనేయ స్వామి వారిని ప్రతిష్ఠించి ర్యాలీగా ముందుకు కదిలారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శోభాయాత్రవద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. కమిటీ నేతలు జెండా ఊపి హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీని ప్రారంభించారు. శ్రీ హనుమాన్ శోభాయాత్ర సుల్తానాబాద్ నుండి చెంచుపేట, ఓవర్ బ్రిడ్జి మీదుగా మార్కెట్, రైల్వేస్టేషన్ వంతెన, ప్రకాశం రోడ్డు, నెహ్రూ రోడ్డు, గాంధీచౌక్, శివాజీచౌక్, కొత్తపేట, దేవిచౌక్ కూడళ్ల మీదుగా బోసురోడ్డులోని శ్రీ చిట్టి ఆంజనేయ స్వామిమందిరం వరకూ కొనసాగింది. దారిపొడవునా జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలు మార్మోగాయి. శోభాయాత్ర సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చూశారు. వివిధ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు కాషాయ జెండాలు చేతపట్టుకుని శోభాయాత్రలో పాల్గొన్నారు. శ్రీ హనుమాన్ శోభాయాత్ర కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



ప్రారంభ పూజల్లో మాజీ ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ రాధిక